వెండిగవ్వలు

* * *

ఎక్కడ ?...

స్పార్టాలోనా ... ఏథెన్సుపురోద్యానములోనా? ... మహా శిల్పి ఫిడియసు...కరువునబోసి, పనితనములో చైతన్యభ్రాంతు లూరించిన వృషభ విగ్రహములను చూసి ... గ్రీక్ యోధము గార్భిణమైనది...ఎక్కడ...?

రాజమహేంద్రవరంలో ... ఉపన్యసించినది ... నేరారోప ణముకాగా ... రాజకీయ నిర్బంధనమున ... కోయంబత్తూరు జైలులో ... పద్దెనిమిది నెలలు పరిమితిగా ... ఏకాంతవాసము చేస్తూన్న క్షీరసాగరం జీవితారామవాటిని...ఒకపరి, ఆనాడు చైత్రి శోభలు...వన్నెలు తేలినవి. దేశహితమే...ఏకైకలక్ష్యంగా... స్వార్థరాహిత్యము అలవరచుకున్న...యోధమూర్తి మనస్సరసిని... కలువకన్నె...ప్రణయాపాంగ తరంగికలు...చిలువపలవలై ...కలచి వైచినవి.

'...కవలపిల్లలు!... మూడవనెల మొన్నపంచమికివచ్చింది : కృష్ణసాగరం, సాగరేశ్వరి...(ఇంకోపేరు సాగరబాల) అని నామ కరణం చేశాము. —ముద్దుకు...వెండిగవ్వలు...అని పిలుచుకుం టూన్నాను. అభ్యంతరమేమీలేదు కాదూ?— క్షేమం వ్రాయిం చండి...

—కనకం'

—ఉదయమే టపాలో వచ్చింది ఉత్తరం. అధికారులు... విప్పిచూసి...మాటు మణచవలసిన అవసరము లేని యింటివిషయము

లని... సమీతులలో అన్వయించుకుని, రవాణా చేయగా, సాయంకాలమునకు బట్వాడా అయినది. భోజనము చేసి...గీతలను పఠించి, అప్పుడు...చదివాడు.

తనకు, ప్రత్యేక సంబంధము ఏమీ లేని...సంతోషవార్తను ఆదరించే శుభోత్సాహమే తప్ప విశేషము ఏమీ గోచరించినది కాదు, మొదట. చదివి...చదువుతూ, తదవలంబనమున భావనలో తేలిపోయి...పూర్వస్మరణముతో...అన్వయించుకుని, ఆశ్చర్యపడిపోయినాడు. మోహపుచూపుల విలువలు...గ్రీకు కథలలో చిన్ననాడు చదువుకున్నవి జ్ఞాపకం వచ్చినవి...

కనకం...వెండిగవ్వలు...కవలపిల్లలు— ఈ త్రిరత్నములను అప్రయత్నంగా...భావనాధీనుడై మననంచేస్తూ...వెనకటి కథ... మానసవీధిని పునరావృత్తము చేసుకున్నాడు.

*   *   *

అసలు...

క్షీరసాగరంకన్న...ఆతని పేరుప్రఖ్యాతి ముందువచ్చి వాలినవి...ఆ ఊరు. యూరోపీయ విశ్వవిద్యాలయములలో మానసతత్త్వపరిశోధనలలో కొత్త తెరువులచూపి...డాక్టరు పట్టమును, ప్రశంసలను అందుకుని...జైత్రయాత్రచేసి తిరిగివచ్చిన జ్ఞానయోధుడు...రసైకజీవి... త్యాగశీలుడు...ఉత్సాహి. స్వదేశమున కాలుపెట్టగానే...దేశదాస్యవిమోచన-ఆవేశములో...గొప్ప పదవులను ఆశించక...దొరతనము ప్రాపకమునులక్ష్యముచేయక...స్వలాభచింతనలు మాని...దీక్షితుడై, నడుముకట్టుకుని అసహాయోద్యమశ్రుతిలో, స్వేచ్ఛాగీతికాలాపనమునకు ముందంజ వేసిన ఉదారుడు. మాతృభూమికి...మళ్ళివచ్చినది—పాశ్చాత్యవేషముతో, ఆడంబరముతో.. అధికార దృష్టితో...దర్జాతో! కాలుమోపి...పరిస్థితులు అవగాహన చేసుకోగానే...హిందూదేశమంతా...అహంకారమును

నిరంకుశత్వమును స్వాహా అనివేసి చెలరేగుతూఉన్న సత్యాగ్రహ జ్వాలలు,——చెరసాలలను...వందలువేలుగా, అలంకరించుతూవున్న స్వచ్ఛందులు...ధర్మనియంతలు,...కనబడి, కలవరపరచి...క్షణంలో మనసు పూర్తిగా తిప్పివేసింది——ఈ కరుణా-వీరదృశ్యము:

——కొలంబో రేవులోనే,... స్వదేశీదీక్షబూని, విలాయతీ వస్త్రదహనోత్సవంచేసి... అగ్నిసాక్షిగా వీరకంకణము కట్టుకొని... సన్నద్ధుడై ముందుకు ఉరికిన రాహుతు.

డాక్టరు క్షీరసాగరం...వస్తాడు, ఉపన్యాసం ఇస్తాడు...అనగానే...జనం తండోపతండములుగా విరగబడి పోవడంలో...విశేషము ఏమున్నదీ?

సాయంకాలము అయిదుగంటల రైలులో దిగాడు క్షీరసాగరం. అక్కడనుంచి సరాసరి, ఊరేగింపుతో టౌనుహాలుకు తీసుకు వెళ్ళారు. ఇసుక వేసినా రాలకుండా జనంతో నిండిపోయిన సభ. ఆనందకోలాహలములో... ఉపన్యాసవేదిని అధివసించి... మేఘగంభీర స్వరమున...మహోపన్యాస వాగ్ఝరిని చిత్రప్రవాహ గతుల వెలయించి... హాయ్ అనిపించి...ఉద్రేకం...ఫలోన్ముఖమై భావిభాగ్యోదయమునకు ఉపకరించే...సాధన ప్రణాలికను ఉపదేశించాడు...

పురజనుల కోరికను మన్నించి... నాలుగైదు దినముల వరకూ అక్కడ ఆగిపోయి...తలపెట్టిన... కార్యక్రమమునకు దోవ చూపించి, సలహాయిచ్చి, మొదలు వేయడానికి...ఒప్పుకున్నాడు.

——కృష్ణస్వామిగుప్తకు అతిథి, క్షీరసాగరం:

ఉద్యమానికి సంబంధించేవారు ఎవరు వచ్చినా...చిన్నాపెద్దలని కాకుండా...అక్కడనే మామూలుగా విడిది:

గుప్త...ఉద్యమానికి...ఆప్రాంతాలలో మూలాధారమైన... ప్రత్యేక అభిమాని. లాయరు. కాటకంరోజుల్లోనూ... ఏరెండు

మూడువందలలో సంపాదించుకుంటూ, పెద్దలనాటినుంచీ, క్రమాభివృద్ధిలో ఉన్న ఖాతాతో... భాగ్యభోగములతో... మంచి ఫాయాగా బ్రతుకుతూన్న వాడు. వైశ్యుడే, కాని... పీనాసి కాడు. పిరికి తనం ఏకోశమునా లేదు.

కృష్ణస్వామికి అన్నివిధాలా తగినభార్య కనకవల్లి. మంచి వర్చస్విని. కులమును నిర్ణయించడానికి తగిన అనాకారి పోలికలు ఏమిన్నీ లేవు. చక్కగా చదువుకున్నది. ఈడేరి...విచక్షణ తెలిసిన తరువాత అయినవివాహము.

—దేశమన్నా...దేశభక్తులన్నా ఆమెకు అపరిమితగౌరవం. కృష్ణస్వామిని పూర్తిగా స్వదేశీని చేయడంలో...బాధ్యత, ప్రతిష్ఠ... చాలావరకూ ఆమెదే. 'బాపుజీ, మనం...ఒక కులమేగా. ఆయన మాట మనమే వినకపోతే ఏలా?' అని చలోక్తిసరసము లాడుతూండేది.

సమఉజ్జీలైన దంపతులు...భావాల్లో ప్రతిరూపులై...అరమరికలు లేకుండా సుఖంగా సంసారంచేస్తూన్నారు. పదిఏళ్లైనా... కడుపుఫలించలేదనేకొరత...ఒకటి ఉన్నా...ఆ విచారమును ఇతర వ్యాపృత్తులలో మరపించుకుంటూన్నారు.

—ఆయింటి అతిథి క్షీరసాగరం. ఉపన్యసించినప్పుడు అధ్యక్షత, అధ్వర్యమువహించిన కృష్ణస్వామే...ఆతిథేయ సత్కారములాచరించే భాగ్యానికికూడా నోచుకుని...పొంగిపోయినాడు. భార్యాభర్తలు స్వయముగా కనుక్కుంటూ, క్షీరసాగరమునకు ఉపచారములలో ఏలోపమూ రానీయడంలేదు. సలహాలకోసం...సంభాషించడంకోసం...వచ్చేపోయేవారికి విధి విరామములేదు. పవలు తీరిక ఉండటమే లేదు—

* * *

'పంచదార...చాలునా...కొంచెం కావాలా?'

...పరధ్యానంగా ఏదో యోజిస్తూ నిలుచుని...లాల్చీకి... గుండీలు పెడుతున్నాడు. ఒకమారు సిప్‌చేసి, బల్లమీద ఉంచాడు కాఫీ. హఠాత్తుగా వినబడటంచేత...పోల్చుకోలేక కొంచెం ఉలికిపడి...ఎవరో...ఎక్కడ నుంచోకూడా గ్రహించకుండానే—

'నాకు షుగర్...ఎక్కువే ఉండాలి. అయినా...ఇప్పుడు... సరిపోయింది...' అని జవాబు రోదసిలోకి విసిరాడు.

'రావచ్చునా...?'

'ఓ...'

చేతిలో లాల్చీ మడత కుర్చీమీదవేసి, తువ్వాలు అందుకుంటూండగా...ద్వారానికి ఉన్న క్రోసిపాలల్లిక తెరను తొలగించి కనకవల్లి లోపలికి వచ్చింది.

...లేత చందనం పొందూరు చీరె కట్టుకున్నది. అభ్యంగనం చేసి...తైలయోజనను లేకుండా సంస్కరించినందువల్ల... కైశ్య వర్తులు కాకుండా...చూర్ణకుంతలములు స్వతంత్రింగా పింఛ భ్రమణంచేస్తూ అర్ధకరివేమభ్రాంతిని కలిగిస్తూన్నవి.

...తడబాటు చూపులతో ఆకస్మికంగా అలా వచ్చిన... ఆమెనూ... తన దుస్తులు సరిగా ఉన్నవో, లేవోననీ... రెండు విషయములనూ ఒక్కచూపుతోనే కలయవేశాడు. మల్లెపూవంటి పొందూరుధోవతి సరిపింజెలతో విరిచి కట్టి...బనియన్ వేసుకుని ఉన్నాడు. దువ్వకుండా వదిలివేసిన క్రాప్ గాలిలో, కదులుతూన్నది...

'ఎక్కడకు... ప్రయాణం?' అన్నది—సంకోచములేని, నిర్భయకలుపుకోలుతనంతో:

'...అలా వెళ్ళి...శారదామిల్సు పనివాండ్లతో...ప్రసంగించి వద్దామనుకుంటూన్నాను.'

అడుగు ముందుకు వేసి 'చంద్రశేఖర' అద్దంమీద ప్రాకుతూన్న సాలీడును ఊదేసి—

'డ్రైవరు యింకా రాలేదు. అదీకాక, మబ్బు బాగాపట్టింది. వానవస్తే తగని చిరాకుగా ఉంటుంది...' అన్నది.

'గుప్తగారు...ఎప్పుడు వస్తారు...కోర్టునుంచి...?' అని, ఒక ముహూర్తం నిదానించి... కాఫీకప్ అందుకుంటూ...అడిగాడు.

పరకాయించి...చూచి—

'నాలుగు...నాలుగున్నరకు వచ్చేమామూలు' అన్నది — ఏమిటి విశేషం... అనే చూపుతో.

'మూడైంది...ఇప్పుడు'

'గంట...గంటన్నరలో రావచ్చును. పని ఉన్నదా ?'

'లేదు...ఊరికే నే అడిగాను'

'మరిచాను...యీవేళ కొంచెము ఆలస్యమౌతుందేమో!'

'ఏవిా ?'

'వచ్చేటప్పుడే ... ఏకంగా బజారుకువెళ్ళి...రేపు పార్టీకి కావలసిన సామగ్రి తీసుకురమ్మన్నాను.'

'ఏం విశేషం...రేపు ?'

'రేపు...నా పుట్టినరోజు. ప్రతియేడూ పండుగగా...పార్టీ ఇవ్వడం మామూలు...'

'బాగున్నదండీ... ! వెనుక నేనూ ఇలాగ చేసేవాడిని'

'ఇప్పుడు...మానేశారా?'

'ఇంగ్లండులో... ఒకటి రెండుసార్లు చేశాను...తరువాత... యూరప్ ... తిరగడంలో ... క్రమేణ ఏమిటో అశ్రద్ధలోపడిపోయింది. అయితే,... ప్రెజెంట్లు పుచ్చుకునే ఆచారం...'

'నజరానాలు చదివించుకోవడం... నాకు అంత నచ్చదండీ. కాని, వచ్చేవాళ్ళు... వట్టిచేతులతో రావడమేమిటని... ఏమన్నా తీసుకువచ్చి, బలవంతంచేస్తారు. రేపు... చూద్దురుకాని. రేపు, ఏం... అనుమానిస్తున్నారు ?'

'బయలుదేరుదామని...'

'రేపా?... నా పుట్టినరోజుకు ఉండటం ఇష్టంలేకనా, లేకపోతే... ప్రెజెంట్ ఇవ్వవలసివస్తుందికదా అని... భయమా ?'

'భక్తి కుదిరినతరువాత ..భయం ఎక్కడిదీ...?'

'అయితే...ఉంటారన్నమాటేనా ?'

'ఆఁ...'

'...ప్రెజెంటు ఏమైనా తెచ్చినా... మీ రుణం ఉంచుకోనులెండి. మరోరూపాన... ముట్టజెపుతాను...'

'అలాగేం !'

—ఇద్దరూ... చిరునవ్వుతో, రెప్పవేయకుండా... చూసుకుంటూన్నారు... మనసులో...

పోర్టికోలో... మోటార్ ఆగింది. హారన్... ! చివాలుమని గెంతేసి నిష్క్రమించింది కనకవల్లి. చూపు తిప్పివేసుకుని... లాల్చీ వేసుకోవడం మొదలుపెట్టాడు... క్షీరసాగరం.

* * *

మర్నాడు... సాయంకాలము నాలుగుగంటల నుంచీ, గుప్త గారి యింటివద్ద, కోలాహలం ప్రారంభమైనది. కారుల్లో... కోచ్‌ల్లో ...హాజరైనారు పేరంటాళ్లు. నవ్వులు, కేరింతలు... సరసాలు, ఒకటేమిటి—హాలంతా రసపరాకాష్ఠను పొందింది.

పాడకతప్పదని బలవంతముచేసి ఒప్పించారు కనకవల్లిని, నెచ్చెలులు. సమ్మోదసాగరం... గానతరంగ సంక్షుభితము అయినది.

పక్కగదిలో నలుగురైదుగురు మిత్రులతో కలసి... వేడుకలన్నీ వింటూ ఆనందిస్తూన్నాడు.. కృష్ణస్వామి. ఉన్నట్టుండి, క్షీరసాగరం...ఉలికిపడి—

'ఎవరో...పిలుస్తున్నారు...నన్ను' అని లేవబోయినాడు. అపరిమత్తులైన...ఇతరులు...గ్రహించి...బిగ్గరగా నవ్వారు. గుప్త కలత చెందకుండా—

'కాదండీ...క్షీరసాగరశయనా...పాడుతూన్నది, కనకం...' అన్నాడు. పొరబాటు తెలుసుకుని...కిక్కురుమనకుండా...క్షీరసాగరం...పాటవినడం మిషతో ధ్యానమగ్నుడైనాడు.

...ఆరుగంటలకు...హడావడి అంతా అయిపోయి...వచ్చిన వారంతా తిరిగి వెళ్లిపోయినారు. కృష్ణస్వామిని...క్షీరసాగరాన్ని పిల్చుకుపోయి...వచ్చినప్రెజంట్ల నన్నింటినీ సగర్వముగా చూపించింది కనకం: దంతం ఫొటోఫ్రేములు...ఎబనీ పిన్నులు...బ్రోచ్‌లు, —ఒకటేమిటి...వినోదాలంకరణములన్నీ కొల్లలైపోయినాయి. ఒకటొకటి అందుకుంటూ విమర్శగా చూస్తునారు...వాళ్లు.

ఇంతలో... టెలిగ్రాం వచ్చింది. గుప్త విప్పిచూసి... ఒకనిమిషం ఆలోచించి...తొందరగా—" మెయిలుకు వెళ్ళాలి. మళ్ళా రేపు రాత్రికి తిరిగి వస్తాను..." అని ప్రయాణ మౌతూ క్షీరసాగరాన్ని...తాను వచ్చిన తరువాత వెళ్లవచ్చునని...ఒప్పందము చేయించి...బయలు దేరాడు.

కారులో...స్టేషనుదాకా వెళ్ళి...గుప్తను దించి...బాగా చీకటిపడేదాకా షికారు తిరిగి...యింటికిచేరుకున్నాడు, క్షీరసాగరం. కనకవల్లి...ఏదోపనిలో ఉన్నది కాబోలు...కనిపించలేదు. కారు రాకనైనా గ్రహించలేదేమో. క్షీరసాగరం...తనగదిలోకి వెళ్ళి దుస్తులు తీసివేసి...ఫేన్ తిప్పి...'మైండ్'... నూతన సంచికను చూడ్డం ఆరంభించాడు.

తొమ్మిది! ... చదువుతూ... ఆధోరణిలో... వేళే మరచి పోయినాడు. లేచి ఇటూ అటూ... పచారు చేసి... కిటికీ దగ్గరగా నిలుచున్నాడు. సుమపరిమళంతో... భావనలన్నీ మధురించినవి. మొఖమల్ మీద ముత్తైపు పనితనము మెరయించేలాగు... చుక్కలు... మిరుకుమంటూ... వింతవింత కిరణాల రంగుల మొనలు చాచుతూన్నవి...! చల్లని ... పులకలు రేకెత్తించే... గాలి...!

—చప్పున...ఏదో జ్ఞప్తికివచ్చి... పెట్టెతెరచి ఓ పేకెట్ బయటికి తీసి, యోచన ప్రారంభించాడు. హాల్లోకి వెళ్లి... కాల్ బెల్ నొక్కి... తటాలున తన గదిలోకి తిరిగి వచ్చేశాడు. వెను వెంటనే... కనకవల్లి తొందరగా... ప్రవేశించి... 'ఎవరు?'... అని కలయజూచింది... హాలంతా.

'నేనేనండీ...పిలిచింది' అన్నాడు గదిలోనుంచి క్షీర సాగరం.

'ఎందుకండీ... ?' అని...ఎదుటవచ్చి నిలిచింది.

ఇందాక...ఇవ్వడం మరచిపోయినాను. మరి...నా ప్రెజంట్...' అని కొంచెం బిడియంగా అన్నాడు.

'ఆఁ...నిజంగా...ఏమన్నా పట్టుకువచ్చారా ఏమిటి?... నేను నిన్న అన్నాననా... ?'

'లేదు... తేవాలనే...'

'అయితే...ఏదీ?'

...పేకెట్ అందించాడు. పైకాగితము తీసివేసి...చిన్న పెట్టెను తెరిచే సరికి తళతళలాడుతూ... వెండిగవ్వలు!

'ఏం చక్కగా ఉన్నాయండీ, పందెపు గవ్వలు!—ఇంకెప్పుడూ... వీటినే ఉపయోగిస్తాను...' అని, చిన్నపిల్లల బులబాటంతో... చేతులో గలగలలాడించి...పొంగి పోయింది.

క్షీరసాగరం ... ఆమెనూ ... మాటలవైఖరినీ ... రెప్ప వేయక గమనించుతూన్నాడు.

'ఇవాళ...వచ్చినవాటిలోకల్లా ఇవే చాలా బాగున్నవి... నాకు...'

'నిజంగానా...?'

'ముమ్మాటికీ!'

'నిన్న సాయంత్రం...షాపుకు వెళ్ళి... తీసుకువచ్చాను. మరేం మంచివి కన్పించలేదు. ఏదో, తోచింది...'

'చాలు, వ్యాఖ్యానమెందుకూ?'

'...మరిచిపోకుండా ఉంటే...చాలు'

'ఎవరినీ?... గవ్వలనా...మి...మ్మ...ల్నా...?'

'రెండూను...'

'మీ బాకీ...ఎలా తీర్చుకోను?'

'ఏం బాకీ...?'

'ఈ ప్రెజెంటేషన్...'

'ఓ...ఇదా...మరేమో అనుకున్నా...'

'మీరు...భోజనం...మరి'

'చేయలేదండీ...! టిఫిన్...చాలా జాస్తి అయిపోయింది. మీరో...?'

'డిటో!...కొంచెంసేపు...మిద్దెమీద కూర్చుందామా...ఇంత కంటె చల్లగా ఉంటుంది. ఇక్కడ ఉక్కపోయడం లేదూ?'

'ఫేన్...'

'ఉన్నామాత్రం...?'

'ఫర్వా...లేదు...'

'అయితే...'

—కరెంట్ ఫెయిలై దీపాలు ఆరిపోయినవి. మాటలు... గుసగుసలు...ఏమీ నిశ్శబ్దమును భంగపరచలేదు. కాని, ఒకరి నోరు... తాకినట్లు...విదిలించుకున్నట్లు...

.. నాలుగైదు నిమిషములలో లైట్లు పునరుజ్జీవితములైన తరువాత— ఆయన ముఖాన విసుగు,.. ఆమె కవళికలో...నిరాశ.

* * * * * *

అంతే...

వెండిగవ్వలు...

నెలతప్పిన...కబురు తెలియగానే...లోకులు పరిపరివిధముల ...నీలాపనిందలువేసి ఉంటారు. ఏమీ లేకుండానే...రవంత సందుదొరికితే ఆడిపోసుకోడానికి కాచుకుని ఉండే కాకిమూకకు... ఇంకా అంతకన్న నిదర్శనం ఏమి కావాలి?...కనకం...ఎబ్బెరికం లేకుండా...మొగవారితో కలసిమెలసి తిరగడం...అందరూ ఎరుగున్నదేకాదూ...? క్షీరసాగరంలాంటి...అందకాడు...మాంచి వయస్సులో ఉన్నవాడు...వచ్చి వారియింట్లో మకాం చేయడం,—ఆరోజుల్లోనే సరిగా...గుప్తకు ప్రయాణం తగలడం...ఏది ఎలా ఉన్నప్పటికీ...పాపమోపుణ్యమో అనుకుని ఊరుకోడానికి వీలులేకుండా... అంతకాలంనుంచీ కాపురంచేస్తూన్నా...లేనిది...కడుపు ఫలించడం,- అనక ఎందుకు మానుతారు?— సందేహపు హద్దు...మీరిపోయిన...ప్రత్యక్షప్రమాణం...స్పష్టంగా కానుపించుతూ ఉండగా?

కృష్ణసాగరం...సాగరేశ్వరి...

తీరక...మనసులోనే...మొలకలెత్తిన కోరికలు భావనాయోగమున సిద్ధించినప్పుడు ...పోలికలుమాత్రము...ఎక్కడకుపోతాయి...? ఎంతసహృదయుడైనా...కనకం వర్తనలో...లోటు ఏమీ వుండదని ఎంత నమ్మకంఉన్నా...లోకుల ప్రవాదలను

లక్ష్యము చేయని ధీరుడైనా...కృష్ణస్వామి...ఆ ప్రతిబింబములను చూసినతరువాతకూడా...కళంకమును ... శంకించకుండా... శాస్త్ర మర్యాదను పాటించుకుని...సమన్వయంచేసుకోగల స్వాస్థ్యం ఉంటుందా?...వెనుకటిగౌరవం ఉంచి...ఆమెనుమన్నించుతాడా?...ఏమో... ?

కాని...ఏపాపమూ ఎరుగని... కనకం...వీటిని లెక్క చేయదు. అంత నిబ్బరం ఆమెకు ఉన్నది. ఆలాటి వీరరమణులకు లోకముతో...ఏమిపని ?... ఎవరు ఏమనుకుంటే నేం ?...సరిగా అర్థంచేసుకోలేకపోతే... కృష్ణస్వామిది లోపం. ఆమెకు సహచరుడుగా ఉండటానికి...ఆతడు...తగడు.

కనకం...

వంచన లేమీ ఎరుగని...అమాయకురాలు ...! మాయ చేసి...లోబరచుకొన యత్నించలేదే...! పుంశ్చలీ భావమున... ఆతిథ్య విధులకు హాని చేయలేదే...! మాతృత్వసిద్ధికి...లక్ష్యముగా మానసపూజ చేయడం...అపచారము ఏలా అవుతుంది...? పశు కామన లేమీ లేవే...? కళంకిత కాలేదే...! ఆ ధన్యజీవి...సాఫల్య సమ్మోహనమునకు...క్షీరసాగరం...సాంఖ్య మర్యాదను ఉపకరించడంలో...దోషము...ఏమీ లేదు... లేదు...

కవలు ...కనకం...వెండిగవ్వలు...

వెండి...గవ్వలు...!

* * *